28. తిరుజ్ఞాన సంబంధారు

చోళదేశంలో సర్కాలి (శియ్యాళి) అను దివ్యదేశముంది. ఆ వూరిలో శివపాద హృదయుడు, భగవతి అనే నిష్ఠాగరిష్టులయిన శివభక్తులగు బ్రాహ్మణ దంపతులుండే వారు. జైనమత ప్రాబల్యం హెచ్చుగా నున్న ఆరోజుల్లో శివపాదదంపతులు మొక్కవోని ధైర్యముతో శైవ మతావలంబీకులు గానే వుండిపోయారు. వీరికి చాలకాలము సంతా నము కలుగలేదు. శైవుల బాధ భరించలేనిదయింది. అందుకని శివపాద దంపతులు వంశోద్ధరణకే కాకుండ జైనమత ప్రాబల్యమును అణచి, శైవమతవ్యాప్తికి తోడ్పడగల సమర్థుడైనపుత్రుని తమకు అనుగ్రహించమని ద్రోణేశ్వరుని బృహినాయుకను కొలువ సాగారు. పార్వతీ పరమేశ్వరుల పరమ అనుగ్రహఫలితముగా రవి, ఇతరతారలు ఉచ్ఛద శలో నుండగా ఒక మంచి శోభనముహూర్తమున కుమారుడు కలిగాడు.

ఆ శిశువు పరమశివుడు తనను భూలోకమున పుట్టించినందులకు మరల జన్మనుద్దేశించి నందులకు మిగులవగచువాడు. అందరూ ఆ ఏడుపును బాల్య చేష్టగా భావించెడివారు. ఇంకాపాలు త్రాగే వయసు మాటలుగూడ సరిగారాని వయసు. మూడేళ్ల వయస్కుడయిన బాలునితో ఒక రోజున తల్లిదండ్రులు తటాకమున స్నానము చేయుటకై వెళ్లారు. తీరమున బాలుడిని పరుండ బెట్టి వాళ్లు స్నానమునకు తటాక ములో దిగారు.

పూర్వజన్మజ్ఞాపకమో - బాలుడు పరుండి శిఖరమువంక చూస్తూ - శివవి యోగం భరించలేక ఏడ్వటం మొదలుపెట్టాడు. అది చూచి సహించలేక పరమేశ్వ రుడు పార్వతీ దేవితో సహావచ్చి, పార్వతిని తన స్తన్యమును బంగారు కప్పులో నింపి బాలుని కీయమన్నాడు. పార్వతీదేవి శివకరుణను జ్ఞానమును తన పాలలో అమృతము రంగరించినట్లుగా జోడించి, బాలునికి కళ్లుతుడిచి పాలిచ్చినది.

శేక్కిజారు - ఈ బాలుడు కారణ జన్ముడుగా జన్మించాడని, ఈ విధంగా పేర్కొన్నాడు. శివభక్తుల హృదయములు - ఎనిమిది దిక్కులు సప్తసముద్రములు ఆనందముతో వెల్లి

విరియునట్లు, తమిళభాష దక్షిణదేశముమిగతాప్రాంతములభాషలకన్న ప్రపంచదేశాల భాషలకన్న మిన్నయౌనట్లుగా చేయుటకై తమిళవాఙ్మయము, సంస్కృతి వివిధ దేశ ముల భాషలవాఙ్మయముసంస్కృతిలకన్న మిన్నగా,అన్ని కళలు వృద్ధినొంది అన్ని వీథులు జవము, జీవముతో భాగ్యవంతమగునట్లుగా శైవమతము, వేదాంతము పరిఢవిల్లజేయ - శివకుమారుడు భువిని జన్మించి అలూదయై పిళ్లైయారు అయ్యాడు. శివజ్ఞానం పొం దినందున శివజ్ఞానసంబంధారుగూడ అయ్యాడు. ఈశ్వరకోటిఅయ్యాడు.

ఇంతలో శివపాదుడు బాలుని కడకు వచ్చాడు. బాలుని చేతిలో బంగారు కప్పను, శిశువు మూతిమీద పాలచారలను చూసి సహజముగా తాను సాంప్రదాయ బద్ధుడ గుటచే - పరులపాలను త్రాగుట అపవిత్రముగ తోచి బాలునిచూచి! నీకిప్పడు పాలనెవ రిచ్చారని ఓ విధంగా గద్దించాడు. బాలుడు వ్రేలితో పైకిజూపగా నచ్చట వేదములు పర్య వేక్షించి యుండగా పార్వతీపరమేశ్వరులు వృషభవాహనారూఢులై యున్నారు.

మాటలు గూడ సరిగారాని ఆ మూడేండ్ల బాలుడు జగత్తుకే తల్లిదండ్రులగు పార్వతీ పరమేశ్వరులను వేలెత్తి చూపుచూ ఒక కాలు నాట్య భంగిమన పైకి ఎత్తి ఇలా అన్నాడు.

ఒక చెవిన తాటంకము నుంచుకొని పార్వతితో వృషభారూఢుడై శీర్షమున చంద్రునితో , ఒడలు విభూతితో పరిఢవిల్లుతున్న ఆ పార్వతీపరమేశ్వరులను చూడండి. అని అనర్ఘకవితాధారలతో వృత్తరూపమున పార్వతీపరమేశ్వరుల గూర్చి పదకొండు వృత్త ములలో నుతించాడు. ఈ వృత్తములను తేవారములంటారు.

జగన్మాత క్షీరముత్రాగి పరమేశ్వరుని అపారకృపావిశేషము జ్ఞానము పొందినం దున మూడేండ్ల బాలుడు పుంభావ సరస్వతియైనాడు. జ్ఞానసంబంధారు అయ్యాడు.

పార్వతీపరమేశ్వరుల నుతితో దేవతలు పుష్పవృష్టి గురిపించారు. బాలునకు జ్ఞాన సంబంధమూర్తి అని పేరు వచ్చింది. పార్వతీపరమేశ్వరులు ద్రోణికి వెళ్లారు. శివపాదుడు పార్వతీపరమేశ్వరులను నుతిస్తూ జ్ఞాన సంబంధమూర్తి నాయనారును ఎత్తుకొని, ఆ

వెనుక బయలుదేరాడు.

బాలునెత్తుకొని తల్లిదండ్రులు ఆనందభరితులై ప్రజలందరితో వూరేగింపుగా వెళ్లారు. మరునాడు సంబంధారు తిరుక్కోలకలో ఒక వృత్తమును, మృదువైన చేతులతో తాళం వేస్తూ తాళమున కనుగుణముగా పాడాడు. పరమశివుడు ముచ్చటపడ్డాడు. సంబంధులు తమ కోమల కరములతో తాళము వేస్తుంటే అవి కమిలిపోవునని పరమ శివుడు చిన్నారి హస్తములలో బంగారు తాళద్వయమును ఉంచాడు. ఆ తాళములపై "ఓం నమః శ్శివాయ" అను అక్షరములు లిఖించబడ్డాయి. తన గానమునకు అనుకూల ముగా తాళము వేయుటకు పరమ శివుడు అనుగ్రహించిన స్వర్ణతాళములను బాలుడు భక్తితో తన శిరమున ధరించినట్లుగా ప్రణతుల నర్పించాడు. లయబద్ధముగా స్వర్ణతాళ ములతో జ్ఞానసంబంధారు శివసంకీర్తనకు నారదాది మహాములు, దేవతలు సమ్మో హితులయ్యారు.

సంబంధారు తీర్థయాత్రకై బయలు దేరాడు. ఒక రోజున - తన యాజ్ (వీణ) పై శివుని ఎల్లప్పుడు నుతించుచుండు తిరునీలకంఠయాజ్ పనారు, సంబంధారును కలు సుకున్నాడు. ఇద్దరు దేవాలయములో ప్రవేశించారు. సంబంధారు యాజ్ పనారును తన యాజ్ పై పాడమని కోరాడు. అతను అద్భుతముగా యాజ్ పై పాడాడు. ఆ పాటకు సంబంధారు హృదయము ద్రవించింది. యాజ్ పనారు సంబంధారుతోనే ఉండి , తను యాజ్ వాయింస్తుండగా సంబంధారు పాటలు పాడవలయునని తన అభిలాషను యాజ్పనారు తెలిపాడు. సంబంధారు అంగీకరించాడు.

తీర్థ యాత్రలో సంబంధారు చిదంబరము చేరాడు. నటరాజస్వామిని చూడగానే పరవశించి పోయాడు. తిల్లై లోని (చిదంబరం) బ్రాహ్మణులు ఆ దేవుని గూర్చి ఘనంగా చెప్పారు. సంబంధారుకు ఆ బ్రాహ్మణులంతా శివగణాలుగా కన్పడ్డారు. ఈ దృశ్యము యాజ్ పనారుకు చూపాడు. ఇద్దరికి అద్భుతంగా తోచింది. బ్రాహ్మణులు సంబంధారు కాళ్లకు మ్రొక్కారు. వారు ఆపని చేయబోతుండగా తానే వాళ్ల కాళ్లకు మ్రొక్కాడు.

యాజ్ పనారు జన్మస్థలం చూచిన తర్వాత - సంబంధారుకు తిరు ఆరతూ రాయి వెళ్ళాలని కోర్కె కలిగింది. కొంత దూరము తన చిన్ని పాదాలతో నడిచేవాడు. కొంత దూరము తండ్రి సంబంధారును తన భుజంపై పెట్టుకుని నడిచేవాడు. ఈ విధంగా వారు మారన్‌పాడి చేరారు. ఎండకి , నడక ప్రయాణానికి అలసి పోయారు. ఆ రాత్రికి అచ్చట బస చేశారు.

పరమశివుడు శిశువుకు బాధ కలిగించకూడదనుకున్నాడు. తిరు ఆరతూరాయి బ్రాహ్మణులకు కలలో కన్పించి - వాళ్ళ కొక ముత్యాలపల్లకి, ముత్యాల గొడుగు ఉన్నదని సంబంధారుకు ఆ ఛత్రమును బట్టి పల్లకిలో ఎక్కించుకొని రమ్మని ఆదేశించాడు. సం బంధారు కూడ అలాగే కనపడి ఆ ముత్యాల పల్లకి ఎక్కి తిరు ఆరతూరాయి రమ్మన్నాడు. సంబంధారు దగ్గరకు శివుడు అనుగ్రహించిన ముత్యాల పల్లకి, ఛత్రము తేబడినవి. సంబంధారు, ముందర పల్లకిని , ఛత్రమును అర్చించి తర్వాత పల్లకిని అధిరోహించాడు. దేవుని సందర్శించాడు. ఈ సంఘటనతో జ్ఞానసంబంధులవారు ఆచార్య పీఠము నధిరో హించిరని సర్వులు అంగీకరించిరి. ఆశ్రితులైరి.

త్రోవలో చాలా దేవళములను సందర్శిస్తూ, సంబంధారు తిరిగి తన వూరు సర్కా లికి చేరాడు. అచ్చట అతనికి తల్లిదండ్రులు ఉపనయనము చేశారు. బ్రాహ్మణులు పిల్లవా నికి వేదములు చెప్పటకు ఉపక్రమించారు. వారుచెప్పటకు ప్రారంభించగానే - వారికి ఆ వేదాలు అన్ని అప్ప జెప్పాడు.ఇదంతా పూర్వజన్మ కర్మ విశేషము. పార్వతీ పరమేశ్వరుల, పార్వతీ దేవి స్తన్యము అనుగ్రహము. సంబంధారు వాళ్ళకి పంచాక్షరీ సారాన్ని చెప్పి ఒక పదిగము పాడాడు.

నిదురకాని నిదురలో గూడ
అర్ధముతో హృదయము ద్రవింప
అనుదినము మననము
చేయుమది పంచాక్షరి

మార్కండేయుని ప్రాణము గొనవచ్చిన

జముని గూడ తన్నివైచినది.

అతనికి గూడ ఒణుకు గొల్పినది.

జముని , నమ్రతతో శివుని

పాదముల ప్రణమిల్ల జేసినది

ఈ సమయంలోనే తిరునవుకరసు గూడ సంబంధారును కలుసుకొనుట తటస్థించినది.

మళ్లీ తీర్థయాత్రకు బయలుదేరి తిరుపచిలాశ్రమము చేరారు. అక్కడ పరమ శివ భక్తుడైన మాళవరాజతనయ - నయముకాని వ్యాధితో బాధపడుతోంది. రాజుగారు ఆశ వదులుకొని, ఆమెని తీసుకొనివెళ్లి దేవుని ముందుంచాడు. ఆ సమయానికే సంబం ధారు అక్కడకు వచ్చి చేరాడు. రాజుగారి , అక్కడున్నవారి బెంబేలుతనము చూసి , ఆ రాజతనయ మగతగా నుండుట చూసి - ఆమెను రక్షించమని సంబంధారు ఒక పదిగమును పాడాడు. ఆమె వెంటనే అందరు ఆశ్చర్యపోవునట్లుగా , వ్యాధి నయమై లేచికూర్చుంది. ఈ అద్భుతానికి అందరూ మురిసిపోయారు.

సెంకున్రూరు లో (కొండమీద చెంగునూరు) ప్రజలందరు జ్వరముతో చలి ఎక్కు వగా నుండి బాధపడుచుండుట చూచి వాళ్ల బాధ నివారణమునకు వృత్త జాలములతో శివుని నుతించి వారి బెడదను బాపినాడు.

ఈ యాత్రలో వారు తిరువాదూతురాయి చేరారు. తండ్రి ఒక మహా యజ్ఞము జరుప నిశ్చయించాడు. దానికి చాలా ధనము కావలసి వచ్చింది. దేవళమునకు వెళ్లి దేవుని నుతింపగా శివగణములోని ఒకడు వచ్చి ఒక ధనపు సంచినిచ్చాడు. అందులో సహస్ర సువర్ణ నాణెములున్నాయి. పరమశివుడు దానిని యిచ్చినారు. సంబంధారు దేవుని నుతించి ఆ ధనపు సంచిని తండ్రికిచ్చాడు. దానిని తీసుకొని సర్కాలి వెళ్లి ఆ యజ్ఞమును తండ్రి పూర్తిచేశాడు.

యజపనారు తల్లి పుట్టినిల్లయిన ధర్మ పురంలో యజపనారు వీణ వాయిద్యము గురించి అందరు పొగిడారు. యజపనారు ఇదంతా సంబంధారు కృపయే.ఆయనను అనుసరించి వెళ్లుట మూలాన అమృతమయంగా వీనుల విందుగా ఆ వాద్యము సాగి నదని , అంతా సంబంధారు పడిగముల మహిమేనని చెప్పాడు. ఈ మాటలు నిజమని నిరూపించటానికి సంబంధారు గణేషును గూర్చి పడిగమును పాడాడు. ఆ కృతిని యజ పనారు వీణమీద పలికించలేకపోయాడు. యజపనారుకు చిన్నతనముగా తోచి ఆ వీణి యను ముక్కలు చేయ ప్రయత్నించాడు. సంబంధారు అతనిని వారించి దేవుడు తనకి చ్చిన వైభవముతో సంతృప్తి నందమని బుజ్జగించాడు. మధుర దేవుడు భక్తుల కలలో కన్పించి యజపనారును గర్భగుడిలోనికి తీసుకొని వచ్చి పాడించమని నిర్దేశించడం, యజపనారు అటుల పాడుట పైగా (61) తడినేల తగిలితే యాజ్ పాడవుతుందని అం దుకని యజపనారుకు దేవుడు బంగారు ఆసనము వేయించి దానిమీద అతనిచేత పాడించుకోవటం అన్ని గుర్తుచేసి దేవుని కృపకు సంతృప్తి నొందమని యజపనారు వీణను భగ్నముచేయ తలంపు నుండి విరమింపజేశాడు.

తర్వాత సత్తిమంగాయి వెళ్ళాడు. అక్కడ తిరునీలకంఠ నాయనారు ఈయనకు ఆప్యాయంగా భక్తితో స్వాగతం చెప్పాడు. సంబంధారు ఒక వృత్తమును పాడి నీలకంఠనా యనారును ఆహ్లాదపరిచాడు. ఉన్నతుల ప్రవర్తనే యిది. వారి శివభక్తుల మీద శివుని కన్న నెక్కువ భక్తి శ్రద్ధలు చూపుతారు. మానవులుగా గాక వారు కూడ అపరశివమూర్తు లను గానే ఎంచి వారి ఎడ భక్తి శ్రద్ధలు చూపుతారు.

అక్కడి వున్నని రోజులు - సంబంధారు ప్రతిదినము తిరుమరుగల్ దర్శించి అచ్చట దేవుని అర్చించేవాడు. ఒక రోజున ఒక వ్యాపారి తన భార్యతో గూడ అక్కడకు వచ్చాడు. దంపతులు నిదురపోతుండగా భర్తని ఒక పాము కాటువేసింది. అతను మృతి నొందాడు. వైద్యులు ఏమీ చేయలేకపోయారు. భార్య దేవుని గూర్చి ప్రార్థించింది. దేవుని కరుణ చూపుమని , భర్తకు బ్రతికించమని వేడుకొంది ఆ సమయాన్నే సంబంధారు

అచ్చటికి విచ్చేశాడు. సంబంధారు ఆమెను ఓదార్చి ఏడుపుకు కారణమడిగాడు. ఆయ నకు జరిగింది చెప్పింది. సంబంధారు ఒక వృత్తము పాడాడు. ఆ వణిజుడు వెంటనే బ్రతికాడు. అందరూ సంబంధారుకు మ్రొక్కి అర్చించారు.

సిరుతొండారు అభ్యర్థనపై చెంకటన్‌కుడి దేవుని చూచి ఆయన దర్శనాన్ని కోరాడు. అక్కడ దేవుని అర్చించి వెళుతుండగా దేవుడు అక్కడున్న రూపంలో నిజరూప దర్శనమిచ్చాడు. త్రోవలో తిరుపూకలూరు దర్శించి మురుగ నాయనారు అతిథిగా నుండి ఆయనను కొన్ని వృత్తములతో కీర్తించాడు.

అప్పరు సూచన మేరకు సంబంధారు తిరువావూరు వెళ్లి దైవమును త్యాగీశుని దర్శించాడు. మురుగ నాయనారుతో అప్పరు, సంబంధారు కొంత కాలము గడిపారు. అక్కడి నుండి కడవూరు వెళ్ళి గుగ్గలు కలశ నాయనారు ను కలిసికొని - గుగ్గలు కలశ నాయనారు వైభవమును కీర్తించాడు. అక్కడి నుండి ఇద్దరు తిరువీలిమిళు గ్రామానికి వచ్చారు. అక్కడ సర్కాలి నుండి వచ్చిన బ్రాహ్మణులు, సంబంధారును సర్కాలి వచ్చి అక్కడ దైవము తోనియప్పారును చూడవలసినదని ప్రార్థించారు. మరునాడు ప్రొద్దున సంబంధారు దేవాలయమునకు అర్చనకు వెళ్ళగా అచ్చట తన ముందు తోనియ ప్పారే ఆసీనులై యున్నట్లుగా చూచాడు. ఆయనను కొన్ని పడిగములతో స్తుతించాడు. సర్కాలీ బ్రాహ్మణులకు తొలియప్పారును ఇక్కడనే చూసినట్లుగా తెల్పి వారిని పంపివే శాడు. ఈ గ్రామములోనే మరికొంత కాలము సంబంధారు , అప్పారు ఉండవలసిన అగత్య మేర్పడింది. అచ్చట ఘోరమైన క్షామము సంభవించింది.

జన సామాన్యమేగాక శివభక్తులు గూడ చనిపో సాగిరి. నాయనారు లిరువురు ఈ ఘోరకలి చూసి చలించిపోయి స్వామి సన్నిధికి పోయి ప్రార్థించిరి. శివుడు దర్శన మిచ్చి క్షామము పోవునంతవరకు నేను చెరిఒక సువర్ణ మిచ్చెదను పోయి వారి ఆర్తిని తీర్చండి అని చెప్పాడు. అప్పారుకు పడమటి బలిపీఠమునందు సంబంధారుకు తూర్పు బలిపీఠమునందు చెరి ఒక సువర్ణ నాణెము కనిపించింది. అప్పారు తనకు లభ్యమైన

నాణెముతో వస్తువులను కొనుగోలు చేసి భక్తులకు సహాయ భూతుడయ్యెను కాని సంబంధారు వెంటనే సాయము చేయలేకపోయాడు. సంబంధారు నాణెములో కొంచెము నాణ్యత తగ్గినట్లు కన్పించింది. సంబంధారు గాఢ భక్తి తన భక్తిని అతిక్రమించిందని భావించాడు. అందుకని దేవుని గూర్చి ఒక వృత్తము పాడాడు. సంబంధారు నాణెము గూడ మేలిమైనది. వస్తువులను కొని బాధార్తులను ఆదుకోగలిగాడు.

కొన్ని దినములకు క్షామము తొలగినది. నాయనారు లిరువురు వివిధ శివ క్షేత్రములను సందర్శించుచు తిరమరైక్కాడు (వేదారణ్యము) నకు వచ్చారు. వేదారణ్య స్వామికి పూర్వము ప్రవేశద్వారమున వేదముల నర్చించెడి వారు. కాలవశమున ఆ అర్చన, పఠనము ఆగిపోయినది. ఆ ప్రవేశ ద్వారము మూసుకొని పోయినది. భక్తులు మరియొక ద్వారము నేర్పాటు చేసుకొన్నారు. సంబంధారు అది చూచి ఈ ద్వారము తెరువబడునట్లు వృత్తములను వినుతింపమని అప్పారును కోరెను. అప్పారు (వాగీశుడు) పాడగా పూర్వపు ప్రవేశద్వారము తలుపులు అవంతట తెరువబడినవి. సేవ ముగించి వారిరువురును ఈవలకు వచ్చిరి. ఇప్పుడు అప్పారు సంబంధారును తలుపులు మూయబడునట్లు ప్రార్థింపవలసినదిగా కోరెను. సంబంధుడు వృత్త జాలముతో వినుతింపగా ద్వారము మూసికొనిపోయినది. అచ్చట నున్న భక్తులందరు వారిరువురు కైలాసమునుండి వచ్చిన మహానుభావులని తలచారు.

వాగీశుడు (అప్పారు) సంబంధారు ఒకరినొకరు పొగడు కొనుచు నిదురించారు. నిదురలో స్వప్నమున దేవుడు సాక్షాత్కరించి “నా దర్శనము తిరువామూరున నగును” అని చెప్పాడు. అప్పారు అట్లు కాదు ఆగుము అని ప్రార్థించాడు. స్వామి నిలిచి సేవనందుకున్నాడు. సంబంధుడు కూడా సేవలను చేశాడు. మరునాడు ఇరువురు తిరువామూరు వెళ్ళి అక్కడ దర్శనమంది మరల వేదారణ్యమునకు వచ్చారు.

మధురలో జైనుల ప్రాబల్యము అధికముగాజొచ్చింది. పాండ్య భూపతి జైనమ

తము స్వీకరించాడు. అందరూ జైనమతమును స్వీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాణి మంగయార్ కరసియారు , మంత్రి కులాచ్చిరాయి నాయనారు ఈ ఇరువురు మాత్రమే జైనుల ప్రాబల్యమునకు లోనుగానిది. శైవ మత గుర్తులు బాహ్యమునకు చూపించక పోయినా, మనసా వారు స్థిరశివభక్తులు. రాజు మనసు త్రిప్పాలని తలచారు. సంబం ధారుగూర్చి విన్నారు. వారి శక్తులను వారు సాక్షాత్ శివస్వరూపులుగను , శివకుమారు లుగను తెలిసి కొన్నారు. వారొక్కరే మధురలోని బెడద నివారించగలరని వారు శైవమ తోద్ధరణకైఅవతరించారని - సంబంధారును ప్రార్థించి మధురకు తీసుకొని రావలసి నదిగా రాయబారులను పంపారు. వాగీశుడు, సంబంధారు ప్రయాణమైరి. కానీ వాగీ శుడు “మహాశయా మీరు వయసున బాలురవై యున్నారు. జైనులు కడు దుర్మార్గులు. మీకు అపకారము తలపెట్టెదరు. వారి వలన మీకు ఏమి కీడు మూడునో అని సంశ యించుచున్నాను. మీరు వెళ్ల వలదు” అని ప్రాధేయపడెను. సంబంధుడు పరమ శివుని అనుగ్రహము ఉన్నంత వరకు ఎట్టి ఆపద మనలను సమీపించజాలదు. మీరు ఈ చోళ దేశమునందే యుండుడు. నేను అంతయు చక్కజేసి తిరిగి వచ్చెదను. అని చెప్పి వాగీశుని అచ్చటనే నిలిపివేసి వేదారణ్యేశ్వరుని ఒక మారుసేవించి పడిగములను పాడి - మధురకు బయలుదేరి వెళ్లినాడు. అప్పారు సంబంధుని కారణజన్ముడుగా దైవాంశ సంభూతుడుగా నెఱిగి మధురకు వెళ్లనిచ్చినాడు. సంబంధారు మధురకు బయలుదేరాడు.

ఇచ్చట మధురలో జైనులకు అన్ని దుశ్శకునములే కన్పించాయి. రాజుకు దుశ్శ కునముల గూర్చి చెప్పారు. రాణి, మంత్రికి మాత్రము అన్ని శుభశకునములే కన్పించినవి. అందుచే సంతోష భరితులైనారు.

సంబంధారు మధురకు వస్తున్నట్లు రాణికి, మంత్రికి తెలిసింది. రాణి మంత్రిని సంబంధారును గౌరవపురస్సరముగా ఆహ్వానించమని కోరింది. తానుగూడ సుంద రేశ్వరస్వామి సన్నిధికి పోయి సేవించి సంబంధుని రాకకు ఎదురుచూడసాగింది.

మంత్రి పొలిమేర సమీపిస్తుండగా సంబంధుని ఆగమన మేళతాళములు వేద ఘోషలు వినిపించాయి. ఆ దెస వెళ్లాడు. ఆ భక్తులను చూడగానే మనస్సు పరవళ్లు తొక్కింది. సంబంధారుకు సాగిలపడి లేవలేదు. భక్తులను ఇది దిగ్భ్రమ గొలిపింది. సంబంధారు తన పల్లకి నుండి దిగి మంత్రి కులాచిరాయిని లేవదీసి పరిష్వంగనం చేశాడు. దూరం నుండి దేవాలయ శిఖరం చూచి అక్కడి నుంచే సుందరేశ్వరుని అర్చించాడు. రాణి గూర్చి మంత్రి గూర్చి వృత్తములలో శ్లాఘించాడు. అందరు దేవాలయ ములో ప్రవేశించారు. రాణి ఒక ప్రక్క ఒదిగి మనసులోనే సంబంధారుకు ప్రణతులు తెల్పినది. తర్వాత ఆయన పాదములపై పడింది. సంబంధారు ఆమెను ఆశీర్వదించాడు.

జైనులకు సంబంధారు ఆగమన వార్త తెలిసింది. పంచాక్షర మంత్రఘోషలు ఎల్లెడల నిండినవి. వారిని ఆహ్వానించిన వారిని రాజుచే శిక్షింపజేయ తలచారు. రాజు గారికి శైవుల మూలమున మధుర అపవిత్రమైనదని, దీనికి కారణము ఒక చిన్న బ్రాహ్మణ బాలకుడని అతనికి శివానుగ్రహమున్నదని అందరూ చెపుతున్నారని, మంచి మతమేదో మనతో వాగ్వాదముతో తేల్చుకోటానికి వచ్చినట్లు గాను రాజు గారికి చెప్పారు.

రాజు సమాలోచన జరిపాడు. జైనులు ఆ వచ్చిన బ్రాహ్మణ బాలకుని శిబిరమును తగులబెట్టుటకు రాజుగారి అనుమతినడిగారు. రాజు గారు అనుమతినిచ్చారు. కాని అది ఫలించలేదు. రాజు మనస్సు ఆందోళనతో నుండుట చూచి రాణి కారణమడిగింది. "ఉభ యులను పిలిచి ఏది మంచి మతమో సభలో తేల్చుటయే మంచిది" అని రాజుకు సలహా ఇచ్చింది. రాజుగారు కూడా ఒప్పకున్నారు.

జైనులు సంబంధారు గుడారము తగుల బెట్టలేక పోయారు. కాని సంబంధారు అనుయాయుల గుడారాలకి నిప్పంటించ గలిగారు. అనుయాయులు సంబంధారు దగ్గరకు పరుగెత్తారు. గుడారాలకు నిప్ప పెట్టినట్లు చెప్పారు. సంబంధారు ఒక వృత్తము పడిగము, పాడాడు. రాజు గారి మూలమున ఈ పనిజరిగినది కాన ఆ మంటలు రాజు గారి దెసకు మళ్ల వలసిందిగా పాడాడు. సంబంధారు వృత్తము పాడగానే అనుయా

యుల గుడారముల అగ్ని ఆరిపోయింది. మహా భయంకరమైన రుగ్మతగా శరీరమున మంటలుగా రాజును చుట్టుముట్టాయి. రాజుగారు శరీరమున తీవ్రమంటలతో బాధపడ డం మొదలుపెట్టాడు. వైద్యుల కృషి జైనమతాధికారుల మంత్రములు రాజుగారి దేహాగ్నిని చల్లార్చ లేకపోయాయి. రాణిగారికి, మంత్రికి అసలు కారణమర్థమయింది. సంబంధా రును ఆహ్వానించి ఆయనను ప్రార్థిస్తే రోగము నయమవవచ్చునని రాజుగారికి రాణి చెప్పింది. రాజు సంబంధారుకు వెంటనే ఆహ్వానము పంపాడు. రాణి వెంటనే సంబం ధారును ఆహ్వానించుటకు ఆయన కడకు చెలికత్తెలతో వెళ్లింది. కులాచ్చిరాయిర్ ఆమె కంటే ముందుగా సంబంధారును చేరుకున్నాడు. ఇద్దరు సంబంధారు కాళ్ల మీద పడి, రాజుగారి దుస్థితి తెలియజేసి, జైనుల దుష్కృత్యముల ఫలము రాజుగారిని చుట్టుకున్నది, జైనులు రాజును ఆ దుస్థితి నుండి తొలగించ జాలరైరి. మీరు వచ్చి రాజును వ్యాధి నుం డినయము చేసి శైవమత మహాప్రభావము సభలో వాదించి రాజుకు తెలియునట్లు చేయవలసిందిగా అభ్యర్థించారు. రాజును రక్షించవలసిందిగా ప్రార్థించారు. సంబం ధారు అంగీకరించి - దేవాలయమునకు వెళ్లి సుందరేశ్వరుని ప్రార్థించి ఆయన అనుగ్ర హము పొంది - రాణి, మంత్రులతో రాజమందిరము చేరాడు. రాజుగారు సకల మర్యాద లతో సంబంధారును ఆహ్వానించారు. ఒక అలంకరించిన సింహాసనముపై సంబం ధారును కూర్చుండ బెట్టాడు. ఇది జైనులను అసహనానికి గురిచేసింది. జైనులతో సం బంధారును వాదించమన్నారు. జైనుల దౌర్జన్యము బాలకుని ఇబ్బందికి గురి చేస్తుందే మోనని భావించి తెలివిగా - సంబంధారు రాజుగారిని రుగ్మత నుండి తొలగించిన తర్వాత వాదనలో జైనుల ఓడించమని రాణి సంబంధుని అభ్యర్థించింది. రాజుగారు దీనికి అంగీకరించారు. సంబంధారు తాను దీనికి అసలు భయపడనే భయపడనని చెప్పాడు.

రాజుగారు ఉభయులను తన వ్యాధి కుదుర్చుడని ఆదేశించాడు. జైనులు రాజు గారి దేహమునకు ఎడమ పార్శ్వమును కుదుర్చుదుము, సంబంధారుని రాజు గారి

కుడిప్రక్కన కుదుర్చవలసినదిగా చెప్పిరి. రాజు అంగీకరించాడు. జైనులు రాజుగారి శరీర మును నెమలి ఈకలతో ఎడమ పార్శ్వమంతా నిమిరారు. మంత్రాలు చదివారు. వ్యాధి నిమ్మళించుటకు బదులు ఎడమ పార్శ్వమున మంటలు అధికము కాజొచ్చాయి. రాజు గారు చాల దయనీయముగా సంబంధారు వంక జూచాడు. సంబంధారు విభూతి మహిమను గూర్చి ఒక పడిగమును పాడి రాజుగారి దేహానికి కుడి ప్రక్క అంతా తన చేతితో విభూతి భస్మమును అలదాడు. ఆ దెస వెంటనే మంటలు చల్లారాయి. రాజు చాలచల్లని అనుభూతి పొందాడు. రాజుగారు జైనుల దెస తిరిగి మీరు ఓడిపోయి నారనిచెప్పి సంబంధారు దెస తిరిగి, తన ఎడమ పార్శ్వమును గూడ మంటల నుండి విముక్తిచేయమని అభ్యర్థించాడు. సంబంధారు ఎడమ పార్శ్వమున గూడ విభూతి నలిమాడు. వ్యాధి సంపూర్ణముగా నయమైనది.

రాణి, మంత్రి సంబంధారు కాళ్లమీద పడ్డారు. రాజు కూడా ఆయన పాదాలకు నమస్కరించి ప్రశంసించాడు. జైనులు ఇదంతా సంబంధుని కవితాశక్తని, తమతో మత పరంగా వాదన సల్పునట్లు చేయవలసినదిగా రాజును కోరారు. వాదనలో తాము తప్పక విజేతలమవుతామని చెప్పారు.

సంబంధారు వాదన కంగీకరించాడు. జైనులు సూత్రపరంగా కాక ప్రత్యక్ష ప్రమాణపూర్వకంగా పోటీ జరుగాలన్నారు. సంబంధులు అంగీకరించారు.

జైనులు “మేము మా దైవము యొక్క గుణగణములను ఒక పత్రమున వ్రాసె దము. మీ దైవము గుణగణములను మీరువ్రాయుడు. రెండు పత్రములను అగ్నిలో పడ వేయుదము. ఎవరి పత్రము మండిపోకుండునో వారి మతము ఉత్కృష్టము” అని జైను లు చెప్పిరి. సంబందార్ అందులకు అంగీకరించాడు. ఉభయులు అట్లు వ్రాసిరి. వానిని రాజు అగ్నిలో పడవైచెను. చూచుచుండగానే జైనుల పత్రము బూడిదైపోయెను. సంబం ధుని పత్రము చెక్కుచెదరలేదు. అట్లే వుండెను. రాణి, మంత్రి ఆనందించిరి. రాజు గారికి శైవమతమందు భక్తి అధికమైంది.

జైనులంతటితో వూరుకోలేదు. “మేము ఇంకో పరీక్ష పెట్టెదము, మరల ఉభ యులు చెరియొక పత్రము వ్రాసెదము, వానిని వైఘనదిలో విడువవలెను. ఎవరి పత్రము నీటి వాలునకు ఎదురు ఈదునో వారి మతము శ్రేష్టము” అన్నారు. సంబం ధుడు దీనికిని అంగీకరించెను. ఉభయులు పత్రములు వ్రాసి రాజునకిచ్చిరి. ఓడిపో యినవారికి శిక్ష ఏమిటి అని అడుగగా “ ఓడిన వారిని కొరత వేయుడు” అని జైనులు పలికిరి. అందరును వైఘనదికి పోయినారు. రాజు రెండు పత్రములను నదిలో వేసెను. జైనుల పత్రము నదివేగమున వాలునకు కొట్టుకుపోయింది. శైవుల పత్రము చాల అంద ముగా ఠీవిగా మునిగిపోకుండా నదీ ప్రవాహమునకు ఎదురు ఈదింది. ఈ పరీక్ష జరు గుతున్నప్పుడు సంబంధారు రాజు మీద దైవకృప ప్రసరించాలని పదిగము పాడాడు. ఈ పదిగము మూలాన్ని శైవులు గెలవడమే కాకుండా - రాజుగారికి అంతకు మునుపువున్న గూను కూడా తొలగిపోయినది. నీటిలో వేసిన పత్రము తిరువెడగడము చేరింది. మంత్రి ఆ పత్రమును తిరిగి తీసికోవాలని దాని వెంట వెళ్లాడు. ఈ విషయము గ్రహించి సంబంధారు ఇంకోపాట పాడి ఆ పత్రమును నిలుపుదల చేశాడు. మంత్రి ఆ పత్రమును చేతిలో తీసికొని గుడికి వెళ్లి సుందరేశ్వరుని అర్చించాడు. సంబంధారు రాజదంప తులతో దేవాలయమునకు వెళ్లి నిష్టగా పూజ చేశారు. జైనులకు వారు చెప్పినట్లుగానే కొరత వేశారు. ప్రజలు రాజుననుసరించి శైవమతస్థులయ్యారు. ఈ విధంగా శైవమతం మధురలో తిరిగి ప్రతిష్ఠింపబడ్డది.

రాజు నాయనారును సగౌరవముగా తిరిగి ఆయన మఠములో ప్రవేశపెట్టెను. సంబంధారు తండ్రి శివపాదుడు తన కుమారుడు పాండ్య రాజ్యమున జైనులనోడించి శైవమతమును ప్రతిష్ఠించెనని విని వచ్చి తన కుమారుని జూచి పరమానంద భరితు డయ్యెను. ఆ కార్యమున కృతార్థుడగుటకేకద శివపాదుడు భార్యను శివుని తాము కుమారునికై అర్థించినది?.

మధురలో కొంతకాలముండి సంబంధారు మరల తీర్థయాత్రకు, ఈసారి రాజ

దంపతులను వెంట నిడుకొని బయలుదేరెను. రామేశ్వరములో అచ్చట నుండియే లంకలోని తిరుకోనమలై, తిరుకేతీశ్వరములో దైవాన్ని అర్చించాడు. మంత్రి జన్మస్థలము గూడసందర్శించారు. తర్వాత రాజు నుండి సెలవు పొంది సంబంధారు చోళ దేశానికి మరలాడు.

త్రోవలో ముల్లివాయికారైకి చేరాడు. అక్కడ నది వరదలో నున్నది. పడవవాండ్రు పడవలను చెట్టుకు కట్టివేసి వెళ్లిపోయారు. సంబంధారు నది ఆవలి ఒడ్డుననున్న తిరు కొల్లమ్‌పుత్తూరు దేవుని కొలవాలనుకున్నాడు. ఒక పడవత్రాడు విప్పమని అందులో ఎక్కాడు. దేవుని గూర్చి పాడాడు. ఈ పాటే తెడ్డయింది. వారంతా సురక్షితంగా ఆవలి ఒడ్డు చేరి దైవాన్ని అర్చించారు.

ఇక్కడినుంచి సంబంధారు బృందము బోధిమంగల్ చేరింది. అది ఒక బౌద్ధ కేంద్రము. సంబంధారు బృందము మేళతాళాలతో సంబంధారును కీర్తిస్తూ పాడుతూ వూరులో ప్రవేశించారు. బౌద్ధులకు ఈ విషయమై ఆగ్రహము కల్గింది. వాయిద్యాలని ఆపుమని బౌద్ధులు ఆదేశించారు. ఈ విషయం సంబంధారుకు చెప్పబడింది. సంబం ధారు పాటలన్నింటిని పదిలపరచు సాంబశరణాలయార్ అనే అతను, ఈసారి తనే ఒక పడిగమును బుద్ధనందితల మీద పిడుగు పడాలని పాడాడు. బుద్ధనంది బౌద్ధులలో పెద్ద వాడు. బుద్ధనంది పిడుగుతో గతించాడు. మిగతా బౌద్ధులు పారిపోయారు. కాని మళ్లీ వారు శారిబుద్ధన్ నాయకత్వంతో తిరిగి వచ్చారు. శారిబుద్ధన్ శైవులను వాదనలో గెలవ మన్నాడు. సంబంధార్ ఆశీస్సులతో సాంబశరణాలయార్ వారితో వాదన చేసి బౌద్ధులను ఓడించాడు. శారిబుద్ధన్ తనే శైవమతావలంబి అయ్యాడు. ఆయన అనుచరులు గూడ శైవమతమవలంబించారు. సంబంధార్ అందరిని ఆశీర్వదించాడు. సంబంధార్ అక్కడి నుండి తిరుకడవూరు చేరాడు. అప్పారు తిరుపూంతురితిలో వున్నట్లు తెలిసికొని సంబం ధారు అప్పార్‌ను కలుసుకొనుటకు వెళ్లాడు. అప్పుడే అప్పార్ గూడ సంబంధారు విజయ

వార్తలను విని సంబంధారును కలుసుకోవడానికి వస్తున్నాడు. నిశ్శబ్దముగా ఎవరికి తెలియకుండ సంబంధార్ బృందములో చేరి - సంబంధారును తెస్తున్న పల్లకి ఒక కొమ్మును అప్పార్ తన భుజాలపై పెట్టుకొని మోస్తూవెళ్లాడు. సంబంధార్ అప్పార్ ఎక్కడ అని అడుగగా - "ఇక్కడనే వున్నాను నా పూర్వజన్మ పుణ్యవిశేషముచే మీ పల్లకిని మోస్తూ వున్నాను" అని జవాబిచ్చాడు. సంబంధారు ఆశ్చర్యచకితుడై పల్లకిని దిగి అప్పారును కౌగలించుకున్నాడు.

ఇంకా కొన్ని దివ్యదేశాలని సందర్శించి సంబంధారు సర్కాలి చేరాడు. తిరునీల కంఠ యాజ్‌పనార్, అతని భార్య సంబంధారు నుండి వీడ్కోలు పొంది తమ గృహమునకు చేరుకొన్నారు.

సంబంధారు తొంగైనాడు వెళ్లాలనుకొన్నాడు. సర్కాలి దైవము తోనియప్పారు నుండి సెలవు పొంది త్రోవలో చాలా క్షేత్రములను చూస్తూ తిరుఅన్నామలై చేరాడు. ఆ గిరిని చూడగానే సంబంధారులో తన్మయత్వము వచ్చింది. నేల మీద దొర్లాడు. ఆనందభాష్పాలు రాలాయి. అక్కడ నుంచి తొండైనాడు చేరి తిరువొత్తూరు వెళ్లాడు. అక్కడ సంబంధారును ఒక భక్తుడు సమీపించి నేను బోలెడు తాళ వృక్షములను నాటినాను. కాని అవన్నీ మగ చెట్లయినవి. పళ్లనిచ్చుట లేదు. నన్ను జైనులు ఈ విషయమై ఎగతాళి చేయుచున్నారు. నన్ను ఈ అవహేళన నుండి రక్షించండి అని వాపోయాడు. సంబంధారు గుడిలోనికివెళ్లి అతని దుస్థితిని నివారించమని దేవునికి ఒక పదిగము పాడాడు. తక్షణమే ఆ మగ తాడిచెట్లన్నీ ఆడ చెట్లుగా ఫలవంతమయ్యాయి. ఈ అద్భుతంతో ఇంకా కొంతమంది జైనులు శైవులయ్యారు. సంబంధారు ప్రత్యేకంగా తాడి చెట్లను పేర్కొనుట చేత వాటిలో గూడ సృష్టిక్రమములో మార్పు వచ్చింది.

అంచెలంచెలుగా సంబంధారు తిరువాలంకాడు చేరాడు. ఇచ్చటనే కారక్కాలమ్మ ఆ ప్రదేశము అపవిత్రమగునేమోనని తల క్రింద పెట్టి నడిచింది. తను గూడ ఆ ప్రదేశ

మునకు నడిచి వెళ్లదలచలేదు. రాత్రి అచ్చట పరమశివుడు సంబంధునకు స్వప్నమున సాక్షాత్కరించి నన్ను వృత్తములతో వినుతింపవా? అని అడిగాడు. సంబంధారు వెంటనే మేల్కొని అనేక వృత్తజాలములతో అక్కడనున్న పరమశివుని వినుతించాడు. అక్కడ నుండి బయలుదేరి కాళహస్తి చేరి కన్నప్పనాయనారును దృశ్యరూపముగా చూచి, ఉత్తర కైలాసము, కేదారము, గోకర్ణము, తిరుపతి, ఇంద్రనీల పర్వతము మున్నగునవి చూచి తిరువొత్రియూరు చేరాడు.

మైలాపూరులో శివనేశార్ అనే వణిజుడున్నాడు. అతను మంచి శివభక్తుడు. ఆయనకు సకల సౌభాగ్యాలున్నాయి గాని సంతతి లేదు. కాని తన ప్రార్ధనలకను గ్రహించి పరమశివుడు అతనికి ఒక పుత్రికను ప్రసాదించాడు. ఆమె చక్కని చుక్క. సంబంధారు గూర్చిన విశేషాలు విని తన కూతురుని అతనికిచ్చి వివాహము చేయ సంకల్పించాడు. మానసికముగా సంబంధారుకు తన కుమార్తెను సంబంధారుకిచ్చు టకు నిశ్చయించాడు. ఆ అమ్మాయి పేరు పూంపవాయి. తోటలో పూలను కోస్తుండగా పాము కరచి ఆమె చనిపోయింది. శివనేశార్ తన కూతురిని బ్రదికించిన వానికి అనంత ధనరాసులనిస్తానని ప్రకటించాడు. ఎవ్వరూ రాలేదు. అప్పడు అతనికి జ్ఞాప కము వచ్చింది. తను మానసికంగా తన కూతురును సంబంధారుకిచ్చి వేసితినని, అందుకని ఆ అమ్మాయి దహన సంస్కారములు చేసి, అమ్మాయి భస్మమును సేకరించి ఒక పాత్రలో నిక్షిప్తము చేసి రోజూ పూలతో ఆ పాత్రకు పూజ చేయువాడు. సంబంధారు గూర్చి ధ్యానముచేసేవాడు. సంబంధారు తిరువొత్తియూరు వచ్చియున్నాడని తెలిసింది. వెంటనే ఒక పందిరిని మైలాపూర్ నుంచి తిరువొత్తియూరు వరకు వేయించాడు. భక్తు లను వెంట బెట్టుకొని సంబంధారును కలుసుకొనుటకు తిరువొత్తియూరు బయలు దేరాడు. సంబంధారుగూడ భక్తులతో మైలాపూర్ వస్తున్నాడు. ఇద్దరూ త్రోవలో మధ్యలో కలుసుకున్నారు. సంబంధారు శివనేశన్ గూర్చి, అతని కుమార్తె గూర్చి, ఆమె అస్తికలను పాత్రలో నుంచి పూజిస్తున్నట్లు విన్నాడు.శివనేశన్ కుమార్తెను బ్రదికించి ఆనందింప

జేయాలనుకొన్నాడు. ఇద్దరూ మైలాపూరు చేరారు. సంబంధార్ కపాలేశ్వరస్వామిని అర్చించి శివనేశార్‌ను ఆ అస్తికల పాత్రను తెమ్మన్నాడు. సంబంధారు ఆ పాత్రను ఉద్దేశించి ఒక పాటను పాడాడు. ఓ పూంపావాయి మనుష్యుడుగా ఈ భూమిపై జననమందుట దైవసేవకొరకునున్ను అతని భక్తుల సేవ కొరకున్ను, భగవంతునికి చేయు పండుగలను వీక్షించుటకునున్ను, ఇది నిజమైతే - అందరి ఎదుటకు లేచి రమ్ము, పండుగ చూడకుండా వెళ్లిపోతావా అని పాడాడు. ఒక వృత్తమవగానే పూంపావాయికి తొలి రూపము వచ్చింది. ఎనిమిది వృత్తాలు పూర్తవగానే ఆమెకు జీవము వచ్చి పన్నెండు సంవత్సరముల బాలిక అయింది. పదవ వృత్తము పూర్తవగానే లక్ష్మీదేవి కమలము నుండి ఉద్భవించినట్లు, ఆమె గూడ ఆ పాత్ర నుండి ఉద్భవించింది. అందరూ ఈ అద్భుతాన్ని చూచి ఆశ్చర్య చకితులైనారు. సంబంధారు శివనేశన్ కుమార్తె చనిపోయినదని, ఇప్పడు బ్రదికి వచ్చినామె తన కుమార్తెగపరిగణించవలెనని చెప్పాడు. సంబంధార్ చెప్పిన దానికి శివనేశన్ అంగీకరించాడు. ఆ కన్యకు ఒక ఆశ్రమము నిర్మించాడు. ఆమె ఆ ఆశ్రమములో వుంటూ దేవుని అర్చిస్తూ శివసాయుజ్యమందినది.

సంబంధుడు మైలాపూరునందు కొంతకాలముండి అక్కడనుంచి బయలుదేరి - తిరువామూరు అచ్చరపాకము, పక్షితీర్థము, మొదలగు దివ్యస్థలములలు జూచి చిదంబరమునకు బోయి శియ్యాళికి తండ్రితో చేరాడు.

వయస్సులో సంబంధారుకు పదహారవ సంవత్సరము వచ్చింది. తండ్రి సంబంధారును పెండ్లి చేసుకొనమని కోరాడు. సంబంధారు అంగీకరించలేదు. వివాహము వేదవిధియని దానికి అంగీకరించమని తండ్రి అడిగాడు. సంబంధుడు అందుకు అడ్డము చెప్పలేదు. శివపాదహృదయారు నల్లూరు పెరుమానము వాస్తవ్యుడు, నంబియాండార్ నంబి తనయను నిశ్చయించాడు. సంబంధార్ దేవుని సందర్శించి స్వామి ఆశీస్సులనుపొందాడు. దగ్గరలోనున్న మఠానికి పెళ్లి కూతురు బృందము వారు వచ్చారు. సంబంధారు తన వివాహ దుస్తులలో ముత్యాల పల్లకిలో వివాహ స్థలమునకు వూరే

గుతూచేరాడు. సంబంధారు తన భార్య చేతిని పట్టుకొని అగ్ని చుట్టూ ప్రదక్షిణ చేశారు. శివస్వరూపము అగ్నియే కద. భక్తులతో భార్యతో దేవళమునకు వెళ్లి సంపూర్ణ శరణాగతితో దేవుని అర్చించాడు. సంబంధార్ - తనకు ఇహబంధాల నుండి విముక్తిని ప్రసాదించమని ఒక వృత్తమును పాడాడు. తోడనే - భగవంతుడు అంగీకరిస్తూ - సంబంధార్! నీవు, నీభార్య నీ వివాహమును చూసిన అందరు మీ ఎదురుగానున్న శివ జ్యోతులలో లీనమై నా దగ్గరకు రండి అని ఆనతిచ్చాడు. చూడగా ఎదుట శివసన్నిధి నుండి ఆకాశము వరకు జ్యోతి కన్పడింది. అపుడు భార్యతో గూడ తిరుశ్రీజ్ఞానసంబంధారు ముందుండగా అచ్చటగల భక్తులందరూ ఆ జ్యోతిలో ప్రవేశించి శివసాయుజ్యమందారు. ఆ జ్యోతిలో లీనమగుటకు ముందు సంబంధార్ పంచాక్షరపడిగను పాడారు. ఈ జ్యోతిలోనే తిరునీలకంఠనాయనారు, మురుగనాయనారు, తిరునీలకంఠ యాజ్పనారు, చిరుతొండార్, గుగ్గలుకలశనాయనారు, సంబంధారు తల్లిదండ్రులు, పెళ్లికూతురు చెల్లికత్తెలు అందరూ గూడ ఆ వివాహమునకు వచ్చి సంబంధారుతో ఆ జ్యోతిలోనే లీనమైనారు.

ఈ ద్రవిడ శిశువు శంకరాచార్యుల కన్నివిధముల పోలినవాడు. అద్వైతప్రతిష్ఠ చేసిన శంకరాచార్యునివలె, సబంధార్ శైవమత స్థాపనకు, ఉద్ధరణకు పాటుపడ్డాడు.

****